ఈనాడు కుమురం భీం

శుక్రవారం అక్టోబరు 4, 2024

దారి బాగుపడింది

నాడు



గుంతలమయంగా గిరవెల్లి రోడ్డు

నేడు



మొరం పోయడంతో ఇలా..

మండలంలోని ఎర్రవాగు నుంచి గిరవెల్లి గ్రామానికి వెళ్లాలంటే గుంతలమయమైన మార్గంలో తిప్పలు పడుతూ ప్రయాణికులు అవస్థలు పడేవారు. వానలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచి మడుగులను తలపించాయి. తిప్పలు తప్పించాలని, రహదారి బాగుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మొరపెట్టుకున్నారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యే వరకు గుంతల్లో మట్టిపోయించి చదును చేయిస్తానని హామీనిచ్చారు. ఈమేరకు రోడ్డును చదును చేయించడంతో.. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- దహెగాం, న్యూస్‌టుడే

4 రోజులు చుట్టేద్దాం.. నచ్చిన చోటు చూసేద్దాం!

● ఉమ్మడి జిల్లాపై అవగాహన పెంచుకునేందుకు మంచి తరుణం

నిర్మల్ జిల్లాలో...



నిర్మల్ ఖ్యాతిని తెలిపే కొయ్యబొమ్మలు

నిర్మల్ జిల్లా కేంద్రంలో తయారయ్యే కొయ్యబొమ్మలు చూడాల్సిందే. తేలికపాటి పొనికి కర్రతో 400 ఏళ్ల నుంచి తయారు చేస్తున్న ఈ బొమ్మలు సజీవంగా మన కళ్లకు కట్టినట్లు కనిపిస్తాయి.


◆ ఇక్కడి నుంచి 15 కి.మీ. దూరంలోని నిజామాబాద్ జిల్లాలో ఉన్న శ్రీరాంసాగర్ జలాశయాన్ని చూసిరావచ్చు..

కడెం.. అందాల కనువిందు



కడెం మండల కేంద్రంలో వాగుపై నిర్మించిన జలాశయం నిర్మల్ జిల్లాలోని కడెం, దస్తూరాబాద్‌తో పాటు మంచిర్యాల జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాలకు సాగు నీరందిస్తున్న తీరును, విశేషాలు తెలుసుకోవచ్చు. బోటు ద్వారా జలాశయం అందాలను తిలకించవచ్చు.

బాసర సరస్వతి క్షేత్రం..





చదువుల తల్లి సరస్వతి అమ్మవారు ముథోల్ మండలంలోని బాసరలో కొలువై ఉంది.. గోదావరి నదీ తీరంలో ఉన్న దేవాలయాన్ని దర్శించుకోవడంతో పాటు, అక్షరాభ్యాసం చేయించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వస్తుంటారు.

◆ నిర్మల్ నుంచి బాసర వెళ్లే మార్గంలో కదిలి దేవాలయాన్ని దర్శించుకోవచ్చు..

ఆదిలాబాద్ జిల్లాలో

1200 ఏళ్ల నాటి సూర్యదేవాలయం



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానాన్ని 122 ఏళ్ల కిందట జైనులు నిర్మించారు. ఏటా రెండు సార్లు సూర్యకిరణాలు స్వామి వారి పాదాలను స్పృశిస్తుండటం దీని ప్రత్యేకత. ఆదిలాబాద్ నుంచి 30 కి.మీ. దూరంలో ఉంటుంది.

పర్యాటకుల సందడి.. కుంటాల జలపాతం..



ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల జలపాతాన్ని చూడడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాది మంది నిత్యం వస్తుంటారు. చుట్టూ దట్టమైన అడవిలో ఉన్నందున అటవీమార్గం గుండా జలపాతానికి చేరుకోవడం ఓ అనుభూతి. కుంటాల నుంచి 12 కి.మీ. ఉంది.



అనుభూతిని పంచే పొచ్చెర..



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చెర సమీపంలో ఉన్న జలపాతం పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది. ఎత్తైన ప్రదేశం నుంచి నీరు కిందికి జాలువారుతాయి. దీన్ని వీక్షించడం గొప్ప అనుభూతిగా చెప్పుకోవచ్చు. బోథ్ జాతీయ రహదారి ఎక్స్ రోడ్ నుంచి ఆరు కి.మీ. దూరంలో ఉంది.

దండేపల్లి, న్యూస్‌టుడే

మూడు నెలల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు దసరా సెలవులొచ్చాయి. సెలవులంటే చాలు అందరికీ సంబరమే. కొత్త ప్రదేశాల్లో ఆనందంగా గడుపుతూనే మరో వైపు మనకు దగ్గరలోని చారిత్రాత్మక ప్రాంతాలు, దేవాలయాలను ఓసారి చుట్టి వస్తే అనుభవాలు, జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయి. ఓ నాలుగు రోజుల్లో పిల్లలు చూసే ఎన్నో విశేషాలు.. వివిధ ప్రదేశాలతో ఆయా ప్రాంతాలపై అవగాహన పెంచుకోవచ్చు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని కొత్త జిల్లాల వారీగా ఇక్కడి ప్రాంతాల విశిష్టతను తెలుసుకునే అవకాశముంది.

కుమురంభీం జిల్లాలో...



కుమురంభీం స్మారక మ్యూజియం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్ వద్ద నిర్మించిన కుమురంభీం స్మారక మ్యూజియం ఎంతో ప్రసిద్ధమైంది. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాంలతో పోరాడి జీవితాన్నే త్యాగం చేసిన కుమురంభీం జీవిత విశేషాలను తెలిపే మ్యూజియం ఇది. దీనికి దగ్గరలో ఉన్న కెరమెరి ఘాట్ రహదారి కూడా వీక్షించవచ్చు.



మంచిర్యాల జిల్లాలో...

సింగరేణి.. సిరుల వేణి




మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి 10 కి.మీ. నుంచి 30కిలోమీటర్ల దూరంలోనే శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, ఇందారం, మందమర్రి, బెల్లంపల్లి గనులున్నాయి.. ఇందులో భూగర్భ గనులతో పాటు ఉపరితల గనులున్నాయి. బొగ్గు తీయడం దగ్గర నుంచి రవాణా చేసే వరకు వివిధ దశలు, కార్మికుల శ్రమను తెలుసుకోవచ్చు..

ఎల్లంపల్లి జలాశయం..



గోదావరి నదిపై హాజీపూర్ మండలం ఎల్లంపల్లి సమీపంలో నిర్మించిన జలాశయాన్ని చూడొచ్చు. ఇది మంచిర్యాల, లక్షెట్టిపేట మధ్యలో ఉంటుంది. సాగు నీటితో పాటు హైదరాబాద్ వరకు తాగు నీరందించే ప్రక్రియను వీక్షించవచ్చు.

సత్యదేవుని నిలయం..గూడెం



తెలంగాణలో ఉన్న ఏకైక సత్యదేవుని ఆలయం దండేపల్లి మండలం గూడెం సమీపంలో గోదావరి తీరంలో ఉంది. జాతీయ రహదారిని ఆనుకుని నిర్మించిన ఈదేవాలయం పక్కనే అయ్యప్ప ఆలయం, సాయిబాబా ఆలయాలు ఉన్నాయి...గోదావరి తీరంలో ఎల్లంపల్లి నుంచి నీరందించే గూడెం ఎత్తిపోతల పథకం ఉంది..

◆ ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో చర్చిగా ప్రసిద్ధి చెందిన సీఎస్ఐ చర్చి లక్షెట్టిపేటలోని ఉంది..

◆ మంచిర్యాల జిల్లాలోని జన్నారం నుంచి ఆదిలాబాద్ జిల్లా వరకు విస్తరించి ఉన్న కవ్వాల్ అభయారణ్యాన్ని తిలకించవచ్చు. జన్నారం మండల కేంద్రంలోని జింకల సంరక్షణ కేంద్రం, మ్యూజియంను సందర్శించవచ్చు. ఇక్కడ నుంచి సఫారీ వాహనంలో లోపల ఉన్న అడవిని చుట్టి రావచ్చు.

ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : రోజు రోజుకు పెరుగుతున్న ఆర్థిక మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్‌బీఐ హైదరాబాద్ ఏజీఎం రాధిక భరత్‌లతో కలిసి అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులకు ఆర్థిక మోసాలు, నగదు రహిత లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యత అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ పద్ధతుల్లో జరుగుతున్న ఆర్థిక మోసాలపై అవగాహన కలిగి ఉండి, వాటి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు పిన్ నంబర్లు, ఇతర ఎలాంటి వివరాలు పంచుకోవద్దని హితవు పలికారు. పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా అదే స్థాయిలో మోసాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఆర్థిక మోసానికి గురైతే వెంటనే ఆర్‌బీఐ టోల్ ఫ్రీ నం. 1930 లో తెలియజేయాలన్నారు. సమీప బ్యాంకుకు వెళ్లి వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం దీనికి సంబంధించిన గోడ ప్రతులు ఆవిష్కరించారు. ఆర్‌బీఐ ఏజీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళ్ల ముందే దర్జాగా కబ్జా!


ఈనాడు, ఆసిఫాబాద్

సర్కారీ భూములను కళ్ల ముందే కొల్లగొడుతున్నా.. ఏ అధికారికీ కనిపించదు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ భూముల్లో వెంచర్లు వెలుస్తున్నా.. వారికి పట్టదు. కాలువలను పూడ్చి ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నా.. నిలువరించే ప్రయత్నాలు కానరాదు. ఈ తతంగమంతా జిల్లా ఆవిర్భావం నుంచి కొనసాగుతూనే ఉంది. బాండ్ పేపర్ల మీద రాసుకుంటూ ఈ భూములను క్రయ విక్రయాలు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నా పుర అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ కట్టడాల గురించి తనిఖీల ఊసే లేకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆసిఫాబాద్ పట్టణం 2024న ఫిబ్రవరి 1న పురపాలికగా మారింది. ఇటీవలే కొలతలు పూర్తికాగా 20 వార్డులతో ఆసిఫాబాద్ పురపాలిక, షెడ్యూల్ ప్రాంతాన్ని రాజంపేట పంచాయతీగా ఏర్పాటు చేశారు. పుర, పంచాయతీ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని బీడీపీపీ (బిలా దాఖల పోరంబోకు) భూములను సైతం బాండ్ పేపర్ల మీద రాసిస్తూ పలువురికి అంటగడుతున్నారు. పదుల సంఖ్యలో భవనాలు బీడీపీపీ భూముల్లో పూర్తవుతుండగా, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో పట్టణ ప్రణాళిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.



బీడీపీపీ భూముల్లో కొనసాగుతున్న భవన నిర్మాణం



కాలువ పూడ్చి చదును చేశారిలా..

ఆసిఫాబాద్‌లోని అటవీ చెక్‌పోస్టు ఎదురుగా 215 ఎకరాల బీడీపీపీ ఉంది. సర్వే నంబర్ 39/ఏ, 39/బీ నాలుగు ఎకరాలు రహదారిని ఆనుకుని ఉంటాయి. ఈ భూముల మధ్య నుంచి పెద్దవాగుకు వెళ్లే ఓ కాలువ ఉంది. దీనికి సుమారు 100 అడుగుల మేర అడ్డంగా, మొరంతో పూడ్చి ఆ స్థలాన్ని మొత్తం చదును చేశారు. కాలువ ఒడ్డున ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ సైతం ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

ఇవిగో అక్రమాలు..

◆ ఆసిఫాబాద్ మండలంలోని గుండి వెళ్లే మార్గంలో ఏజెన్సీ భూముల్లో ఓ వ్యక్తి వెంచర్ వేశాడు. ఇప్పటికే ప్లాట్ల వరకు అమ్ముడు కాగా, ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు ఈ ప్రాంతంలో వెలుస్తున్నాయి. జన్కాపూర్ శివారులో పెట్రోల్‌బంక్ వెనుక ఓ నేత వెంచర్ వేశాడు. డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్లు విక్రయించాడు. భూములు కొనుగోలు చేసిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేయాలని అనడంతో.. సబ్ రిజిస్ట్రార్ వద్దకు రెండు రోజుల కిందట వచ్చాడు. అనుమతులు లేవని రిజిస్ట్రేషన్ చేయనని రిజిస్ట్రార్ చెప్పడంతో.. సదరు నేత రాష్ట్ర స్థాయిలో పైరవీలు తెస్తున్నట్లుగా సమాచారం.

◆ ఆసిఫాబాద్‌లోని పాత ఆర్టీఓ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న భూమి సైతం అనధికారికంగా ప్లాట్లు చేసి అమ్ముతున్నారు. బెలూన్ థియేటర్‌ను ఆనుకుని పది ఎకరాల వరకు ఆబాదీ భూమి ఉంది. అది నేడు పూర్తిగా కబ్జాలమయం కాగా, మిగిలిన కొద్దిపాటి స్థలాన్ని రక్షించడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారు. అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

◆ కాగజ్‌నగర్ పట్టణంలో పై భాగం నుంచి 30 ఫీట్ల వెడల్పుతో ప్రవహించే ప్రధాన కాలువ.. ఎన్టీఆర్ చౌక్, నవ్‌గాం బస్తీ, ద్వారకా నగర్, రైల్వేగేటు నుంచి పెద్దవాగులో కలుస్తుంది. ఈ కాలువలోకే అన్ని చిన్నపాటి కాలువలను అనుసంధానించారు. పలు ప్రాంతాల్లో ప్రధాన కాలువ కబ్జాకావడంతో ఏటా వానకాలంలో ఇళ్లలోకి నీళ్లు చేరుతున్నాయి. కాగా కబ్జాలు పట్టించుకోక రూ.లక్షలు ఖర్చు చేసి ప్రధాన కాలువలో పూడికను తొలగిస్తుండటం గమనార్హం.



ఆసిఫాబాద్‌లో వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది

డిజిటల్ కార్డుల సర్వే షురూ

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను గురువారం జిల్లాలో అధికారులు ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని నాలుగు ప్రాంతాలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో ఎంపీడీవో శ్రీనివాస్ బృందం ఇంటింట సర్వే మొదలు పెట్టారు. కాగజ్‌నగర్ పట్టణంలోని 14వ వార్డులో 300 కుటుంబాలు ఉండగా తహసీల్దార్ కిరణ్, కమిషనర్ అంజయ్య, ఎంపీడీఓ రమేష్‌లు మూడు బృందాలుగా ఏర్పడి సిబ్బందితో సర్వే కొనసాగిస్తున్నారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు ప్రత్యేక నమూనాలో నమోదు చేశారు. ఈ సర్వే ఈ నెల 7వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు.

157 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన పక్కాగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని ధ్రువ పత్రాల పరిశీలన కేంద్రాన్ని సందర్శించారు. ప్రక్రియ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. అభ్యర్థులతో మాట్లాడి సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరిశీలన ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 341 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ధ్రువ పత్రాల పరిశీలనకు పిలుస్తున్నట్లు చెప్పారు. 766 మందిని పిలువగా ఇప్పటి వరకు 157మంది ధ్రువ పత్రాల పరిశీలన కోసం వచ్చారని వివరించారు. ఈ నెల 5లోగా ప్రక్రియ ముగుస్తుందన్నారు. గడువులోగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎం.ఉదయ్‌బాబు, తదితరులున్నారు.



అధికారులను పరిశీలన వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయండి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : అనుమతి లేని లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి సర్వే బృందాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. చెరువు శిఖం, వాగులు, ప్రభుత్వ భూములు, రైల్వేలైన్ సమీపంలో ఉన్న ప్లాట్ల రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. కోర్టు కేసు ఉన్న ప్లాట్ల వివరాలను, దరఖాస్తుల వివరాలను పరిశీలించి సంబంధిత అంశాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. సర్వే బృందాలు దరఖాస్తుదారుడికి సమాచారం అందించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పట్టణ ప్రణాళిక అధికారి యశ్వంత్, పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు, నీటిపారుదల శాఖ, పుర అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సర్వే బృందాల అధికారులు, సిబ్బంది

జిల్లాలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో వానకాలం (ఖరీఫ్) ధాన్యం కొనుగోళ్ల కోసం 34 కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే ప్రకటించారు. గురువారం హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్‌లు, ఆర్డీవోలు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ డి.వి.శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారీ, దాసరి వేణు, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలతో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. సరిహద్దుల వద్ద తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా, సహకార, ఐకేపీ, పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో పటిష్ఠమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీఎస్సీ-2024 లో మెరిట్ జాబితా అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన సకాలంలో పూర్తి చేసి ఈ నెల 9న నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

డీఈఎల్ ఎడ్యుకేషన్ ఫలితాలు విడుదల

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : సెప్టెంబరు-2024లో నిర్వహించిన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్) ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలు గురువారం విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య తెలిపారు. ఫలితాలను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. మార్కుల రీకౌంటింగ్ కోసం ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే : ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవనశాఖాధికారి సుప్రజ అన్నారు. గురువారం మండలంలోని మురళీగూడ గ్రామంలో ఆయిల్‌పాం తోటలపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం మొక్కలకు చీడపీడలు పట్టే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్లకు పంట చేతికొస్తుందని, ఒక్కసారి నాటితే 30 ఏళ్లపాటు దిగుబడులు వస్తాయని వివరించారు. సాగు రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వాగు పరీవాహక ప్రాంతాల భూములను పరిశీలించారు. మాట్రిక్ కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, రైతులున్నారు.

టోకెన్ల కోసం వెంపర్లాట



ఆదిలాబాద్ డైట్ కళాశాలకు ధ్రువపత్రాల పరిశీలన కోసం గురువారం భారీగా అభ్యర్థులు తరలివచ్చి కౌంటర్ల వద్ద గుమిగూడారు. ఎంత చెప్పినా వినిపించుకోలేదు. ఆ సమయంలో పాలనాధికారి రాజర్షిషాలోనికి వెళ్లేందుకు కొంత ఇబ్బందిపడాల్సి వచ్చింది. ఇది గమనించిన డీఈవో ప్రణీత అభ్యర్థులకు టోకెన్లు ఇవ్వాలని సిబ్బందిని పురమాయించారు. ఆ టోకెన్ల కోసం అభ్యర్థులు పరుగులు పెట్టి పోటీ పడాల్సి వచ్చింది.

- ఈనాడు - ఆదిలాబాద్, - న్యూస్‌టుడే- పాలనాప్రాంగణం

పచ్చందాల దారిలో.. ప్రకృతిని ఆస్వాదించేలా

సింగరేణి బొగ్గు గనులు, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు విస్తరించి ఉన్న శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పచ్చదనం పెద్దగా కనిపించదు. కానీ మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా పచ్చదనంతో కనువిందు చేస్తూ ఆహ్లాదం పంచుతోంది. శ్రీరాంపూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు 363 జాతీయ రహదారి నిర్మించారు. మార్గమధ్యలోని బొక్కలగుట్ట వద్ద సుమారు 340 ఎకరాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో గాంధారి వనాన్ని అద్భుతంగా విస్తరించారు. ప్రస్తుతం ఆరు కిలోమీటర్లు విస్తీర్ణంలో అన్ని రకాల వేలాది చెట్లు కనువిందు చేస్తున్నాయి. అప్పటి వరకు పచ్చదనం కనిపించని చోదకులు, ప్రయాణికులకు ఒక్కసారిగా ప్రకృతి ఒడిలో నుంచి ప్రయాణిస్తుండటంతో సుమారు కిలోమీటర్ల మేర ప్రత్యేక అనుభూతి పొందుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి నిత్యం వందలాది మంది వ్యాయామం, యోగా, ధ్యానం చేసేందుకు వస్తుంటారు. ఇక్కడ గాంధారి మైసమ్మ ఆలయం ఉండటంతో నిత్యం భక్తులు వంటావార్పు చేసుకుంటూ ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. పక్కనే ఉన్న గాంధారిఖిల్లా గుట్టలు కనువిందు చేస్తున్నాయి.

- న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం



జాతీయ రహదారికి ఇరువైపులా గాంధారి వనం



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, చిత్రంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

నిర్మల్, న్యూస్‌టుడే : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి పాటుపడాలని రాష్ట్ర షెడ్యూల్డు కులాలు, తెగల కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న పథకాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కోసం మంజూరైన, వినియోగించిన నిధులకు సంబంధించిన వివరాలను శాఖల వారీగా అధికారులు వివరించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్ మరమ్మతులకు అవసరమయ్యే నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల విద్యలో ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేసినందుకు కలెక్టర్, విద్యాశాఖ అధికారులను అభినందించారు. జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి అనేక రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కమిషన్ ఛైర్మన్, సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా కృషి చేసిన డీఈవో రవీందర్‌రెడ్డిని కమిషన్ ఛైర్మన్, సభ్యులు సన్మానించారు. ఎస్పీ జానకి షర్మిల, అదనపు పాలనాధికారులు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

చిరునవ్వు నవ్వేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ సాంస్కృతికం : చిరునవ్వుతో మానసిక రుగ్మతలు దూరమవుతాయని శాస్త్రీయంగా రుజువైంది. మానవ సంబంధాలు పెంపొందుతాయి. మనిషి మానసిక స్థితిని ఆహ్లాదకరంగా ఉంచుతుంది. అంతటి ఆరోగ్యాన్ని పెంపొందించే చిరునవ్వుకు ఓ రోజుంది.. అక్టోబరు 4న 'స్మైల్ డే' నిర్వహిస్తుంటారు.

మీకు తెలుసా?



అమెరికాకు చెందిన ప్రముఖ చిత్రకారుడు హార్వే రాస్ బాల్ తొలిసారిగా స్మైలీ ఫేస్(నవ్వించే ముఖం) చిత్రాన్ని గీశారు.

సచిన్‌తో సచిన్..




ఒకరేమో మరాఠీ దిగ్గజ నటుడు సచిన్ పిల్గావకర్. మరొకరేమో క్రికెట్ దేవుడు సచిన్. ఓ పురస్కార ప్రదానోత్సవ వేదికపై ఇద్దరు కలుసుకున్నారు. ఊహ తెలిసినప్పటి నుంచి మిమ్మల్ని చూస్తున్నా. అప్పటికీ, ఇప్పటికీ మీ ముఖం చిరునవ్వుతోనే కళకళలాడుతుందని టెండూల్కర్ అనడంతో వెంటనే మైక్ లాక్కొని మీరు కూడా చిరునవ్వుతోనే క్రికెట్ రంగంలో రికార్డులు నెలకొల్పారని పిల్గావకర్ చిరునవ్వుతోనే సమాధానమిచ్చారు. ఈ దృశ్యం వీక్షకులను సైతం ఆకట్టుకుంది.

అనేక ప్రశ్నలకు సమాధానం..

కొన్ని సందర్భాల్లో మన చిరునవ్వు అనేక ప్రశ్నలకు జవాబవుతుంది. ఇతరుల బాధను మాయం చేస్తుంది. ద్వేషించే వారిని దగ్గరకు చేర్చుతుంది. పిల్లలు తమ తల్లిదండ్రులను, పెద్దలను నవ్వుతో పలకరించాలి. పెద్దలు కూడా పిల్లలకు చిరునవ్వుతో పనులు చెప్పాలి. అప్పుడే ఆ ఇల్లు ఆనందమయ కోవెలగా మారుతుంది. చిరునవ్వుతో బయటకు వెళ్తే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. అందుకే జనాలను నవ్వించేందుకు లాఫింగ్ క్లబ్‌లు, హాస్యభరిత చిత్రాలు, కామెడీ సినిమాలు, రియాలిటీ షోలు అందుబాటులో ఉంటున్నాయి.

ఆరోగ్యానికి మేలు



చిరునవ్వు అనేది మనిషి మానసిక స్థితిని తెలియజేస్తుంది. చిరునవ్వు అలవాటు ఉన్నవారి శరీరంలో నాడీ మండలాలు ఉత్తేజితమవుతాయి. రక్త ప్రసరణ సాఫీగా జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి, అలసట, గ్యాస్ట్రిక్, హైపర్‌టెన్షన్, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మైగ్రెన్, కండరాల నొప్పుల నుంచి కోలుకోవచ్చు. సకరాత్మక హార్మోన్లు ఎండోర్ఫిన్, సెరటోనిన్ విడుదలై మానసికోల్లాస అనుభూతిని పొందుతారు. గుండె దడ నియంత్రణలో ఉంటుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. - డా.ఓంప్రకాశ్, మానసిక వైద్య నిపుణులు

పరుగుల వర్షం కురిపించి..



భారత క్రికెటర్ అజయ్ జడేజాను ఎప్పుడు చూసినా చిరునవ్వుతోనే కనిపిస్తుంటారు. 1996లో జరిగిన ప్రపంచ క్రికెట్ కప్ క్వార్టర్ ఫైనల్‌లో పాకిస్థాన్ బౌలర్లు వకార్ యూనుస్, అకిబ్ జావేద్, అతా-ఉర్-రెహ్మాన్ అజయ్ జడేజాను రెచ్చగొట్టారు. భయపెట్టేలా బాడీలెంగ్త్ బౌలింగ్ వేశారు. ఆయన ఏకాగ్రతను భంగం చేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినా జడేజా వారి కుయుక్తులకు లొంగకుండా చిరునవ్వుతోనే బ్యాట్‌తో పరుగుల వర్షం కురిపించారు. భారత్ భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు.

లాఫింగ్ క్లబ్..



మధుసింఘాల్ ఆదిలాబాద్‌లో మహిళల కోసం లాఫింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ద్వారకానగర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో రోజూ ఉదయం గంట పాటు యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. 50 మందికిపైగా మహిళలు ఈ క్లబ్‌లో చేరి యోగాభ్యాసం చేస్తున్నారు. ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఇంట్లో అందరు బాగుంటారని నిర్వాహకురాలు చెబుతున్నారు.

ఉర్దూ నేర్చి.. ఉద్యోగం సాధించి!

● గిరిజన యువతి ఘనత



పవార్ మౌనిక

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఇంటి చుట్టూ ఉన్న ముస్లింలతో ఉర్దూ భాషలో మాట్లాడటం అలవాటు చేసుకున్న ఆ యువతికి ఆ భాషే చివరకు ఉద్యోగాన్ని సాధించిపెట్టింది. ఉట్నూరు మండలం లక్కారం మసీదు ఏరియాలో నివాసముండే న్యాయవాది పవార్ వసంత్‌రావు కూతురు పవార్ మౌనిక డీఎస్సీ ఉర్దూ మాధ్యమంలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఎస్టీ విభాగంలో రెండు పోస్టులు రిజర్వు చేయడంతో ఆమెకు ఉద్యోగం దక్కడం లాంఛనమే. గురువారం డైట్ కళాశాలలో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనకు ఆ యువతి హాజరైంది. ఇంటర్‌లో ద్వితీయ భాషగా ఉర్దూను ఎంచుకుంది. ఉర్దూ భాషను మిత్రులతో పాటు యూట్యూబ్ సాయంతో నేర్చుకున్నట్లు మౌనిక తెలిపారు. బీఏ లిటరేచర్ ఉర్దూలో చేస్తున్నట్లు వివరించారు. ప్రతిసారి ఉర్దూ మాధ్యమంలో రిజర్వేషన్ కేటగిరి పోస్టులు అభ్యర్థులు లేక మిగిలిపోతున్నాయి. ఈ విషయం తెలిసిన వసంత్‌రావు తన కూతురు మౌనికను ఉర్దూ భాష లిపిని నేర్చుకోవాలని ప్రోత్సహించారు. ఫలితంగా ఆ యువతి ఉద్యోగం సాధించగలిగింది. ఎంపికైన మరో అభ్యర్థి రాథోడ్ ఆర్థిక స్వయాన మౌనికకు చిన్నమ్మ కావడం మరో విశేషం. వీరిద్దరూ ఉర్దూ మాధ్యమంలో పాఠాలు బోధించనున్న తొలి గిరిజన తెగ అభ్యర్థులుగా చరిత్ర సృష్టించనున్నారు.

ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై ఆరోపణల కలకలం

ముథోల్(బాసర), న్యూస్‌టుడే : బాసర ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతిపై పలు ఆరోపణలతో కూడిన కరపత్రం గురువారం ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ పేరిట విడుదలవడం కలకలం సృష్టించింది. ఆ కరపత్రం పలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్‌తోపాటు ఆర్జీయూకేటీ ఉపకులపతిగా కొనసాగుతూ, పేద విద్యార్థులకు చెందాల్సిన డబ్బులు కాజేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులను నియమించుకొని, ట్రిపుల్ ఐటీ ఉద్యోగులుగా రూ.లక్షల జీతం ఇస్తూ అక్రమాలకు తెరలేపారన్నారు. ఆర్జీయూకేటీలో విద్యార్థులు, మహిళా ఉద్యోగులను వేధించడం, అప్పుడప్పుడూ ఇక్కడికి వస్తూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన డబ్బులు దండుకున్నాడన్నారు. చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించి, భోజనశాలల నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఆర్జీయూకేటీ ఉపకులపతిని చరవాణిలో సంప్రదించగా తాను దీనిపై ఏమి మాట్లాడనని తెలిపారు.

శైలపుత్రి నమోస్తుతే..




శైలపుత్రిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవగా గురువారం బాసర అమ్మవారు శైలపుత్రి అవతారంలో దర్శనమిచ్చారు. అంతకుముందు అమ్మవారికి అభిషేకం, వ్యాసమహర్షికి పూజలు చేసి ఘటస్థాపనకు అవసరమైన నీటిని తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో ఘటస్థాపన పూజలో ఎమ్మెల్యే రామారావు పటేల్, ఆలయ ఈఓ విజయరామారావు, ఆలయ ఛైర్మన్ శరత్‌పాఠక్‌లు పాల్గొన్నారు. నవరాత్రులు ప్రారంభం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం, అక్షరాభ్యాసాలు చేయించారు. బాసర మాజీ సర్పంచి దయాల లక్ష్మణ్‌రావు తులం బంగారంతో అమ్మవారికి తయారు చేయించిన ముక్కు పుడకను ఆలయ ఈఓకు అందజేశారు.



ఘట స్థాపన చేస్తున్న ఆలయ వేద పండితులు, ఈఓ విజయరామారావు



ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రదర్శనలో అష్టాదశ శక్తి పీఠాల విగ్రహాలు

బెల్లంపల్లిలో అష్టాదశ శక్తి పీఠాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే : వివిధ రాష్ట్రాల్లో వెలసిన అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకోవాలంటే వ్యయప్రయాసలతో కూడుకున్నది. ఇది అందరికీ సాధ్యం కాదు. శక్తి పీఠాలను దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందనేది భక్తుల విశ్వాసం. అలాంటి శక్తి పీఠాలను బెల్లంపల్లి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేశారు. అమ్మవార్ల శక్తి పీఠాల విగ్రహాల వద్ద మిరుమిట్లు గొలిపేలా లైటింగ్ ఏర్పాటు చేయడంతో వాటి స్వరూపం అచ్చంగా అక్కడికి వెళ్లి దర్శించుకున్న అనుభూతి కలుగుతుంది. దుర్గాదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన శక్తి పీఠాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది.

నిషేధిత మత్తుపదార్థం స్వాధీనం

● సరకు విలువ రూ.43 లక్షలు



పట్టుకున్న ఆల్ఫాజోలం, క్లోరల్‌హైడ్రేట్ సంచులతో ఆబ్కారీ అధికారులు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ గోదాంలో నిల్వ చేసిన కల్తీ కల్లు తయారీకి వినియోగించే మత్తు పదార్థాన్ని(క్లోరల్ హైడ్రేట్) ఆబ్కారీశాఖ రాష్ట్ర బృందం ఆధ్వర్యంలో గురువారం స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 728 కిలోల సీహెచ్‌ను ఇక్కడ నిల్వ ఉంచారు. ఆబ్కారీశాఖ ఉన్నతాధికారులకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో గురువారం సోదాలు చేపట్టగా ఈ విషయం బయటపడింది. స్థానిక ద్వారకానగర్‌లో ఉండే శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి ఇంట్లో ఆల్ఫాజోలం నిల్వ చేశాడనే పక్కా సమాచారంతో అధికారులు తనిఖీ చేపట్టారు. అతడి వద్ద 3.3 కిలోల ఆల్ఫాజోలం లభించింది. లోతుగా విచారించగా శాంతినగర్‌లోని ఓ గోదాంలో సీహెచ్ నిల్వ చేసినట్లు అంగీకరించాడు. అక్కడికి చేరుకున్న అధికారులు సీహెచ్ బస్తాలను స్వాధీనం చేసుకొని కార్యాలయానికి తరలించారు. ఈ మొత్తం విలువ రూ. 43 లక్షలు ఉంటుందని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృంద పర్యవేక్షకుడు ప్రదీప్‌రావు తెలిపారు. నిందితుడిపై గతంలోనూ పలు కేసులు, పీడీ యాక్ట్ నమోదైనట్లు ఆయన వివరించారు. తాజా ఘటనలో అతడిపై మరో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్ నుంచి ఇది సరఫరా అవుతున్నట్లు గుర్తించామని, అసలు సూత్రధారులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు.

ఆటల్లో మేటి.. సత్తా చాటి

మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఏడాదిలో చివరి నాలుగు నెలలు క్రీడా మాసంగా చెప్పొచ్చు. ఎస్‌జీఎఫ్‌తో పాటు వివిధ క్రీడా అసోసియేషన్లు ఈ రోజుల్లోనే పోటీల నిర్వహణ చేస్తుంటారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ ఇలా అన్ని స్థాయిల్లో ఈ 120 రోజుల్లోనే జరుగుతుంటాయి. ప్రతిభ ఉన్న క్రీడాకారులు బయటికొచ్చేదీ.. వారి భవిష్యత్తును బంగారు బాటవేసుకునే అవకాశం ఇప్పుడే కావడం విశేషం. ఈ సంవత్సరం గత రెండు నెలలుగా ఎస్‌జీఎఫ్, అసోసియేషన్లు జిల్లా, జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు పోటాపోటీగా నిర్వహిస్తోంది. ఆయా విభాగాల్లోని క్రీడాకారులు మెరుగైన ఆటతీరును కనబరుస్తున్నారు. రాష్ట్ర, జాతీయ పోటీలకు అర్హత పొందుతున్నారు. ఇటీవల జరిగిన పలు పోటీల్లో సత్తా చాటి.. ఉన్నతస్థాయికి చేరుకున్న పలువురిపై 'న్యూస్‌టుడే' కథనం.



ఇటీవల రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు

రాకెట్‌తో.. ర్యాంకులకు పోటీ



మంచిర్యాల జిల్లాకు చెందిన అనన్య.. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. బ్యాడ్మింటన్‌పై ఆసక్తితో కొంతకాలం జిల్లా కేంద్రంలోనే శిక్షణ పొందగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ శిక్షణ కేంద్రంలో సాధన చేస్తోంది. రాకెట్‌తో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. పాఠశాల క్రీడా సమాఖ్య తరఫున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ఆటతీరుతో ఆకట్టుకుంది. అండర్-15 బాలికల విభాగంలో రాష్ట్రస్థాయిలో 8, జాతీయస్థాయిలో 30వ ర్యాంకులో కొనసాగుతోంది. ప్రస్తుతం విజయవాడలో జరుగుతున్న ఆలిండియా ర్యాంకింగ్ పోటీల్లో మరింత మెరుగైన స్థానం కోసం పోటీపడుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో పీఎస్బీ మెట్‌లైఫ్ జేబీసీ రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికైంది.

హ్యాండ్‌బాల్‌లో జాతీయస్థాయికి



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(సిర్పూర్-టి) పదో తరగతి విద్యార్థి దుర్గం యోగి హ్యాండ్‌బాల్‌లో సత్తాచాటుతున్నాడు. జట్టులో నాలుగో సభ్యుడిగా మెరుగైన ప్రదర్శన ఇస్తూ ఆకట్టుకున్నాడు. ఇటీవల రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ఆటతీరును కనబరిచాడు. ఉమ్మడి జిల్లా జట్టు మొదటిస్థానం కైవసం చేసుకోవడంలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఇప్పటికే నాలుగుసార్లు ఎంపిక కాగా తొలిసారి జాతీయస్థాయిలో చోటు సాధించాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న పోటీల్లో తన ప్రతిభను పరీక్షించుకుంటున్నాడు.

మొదటిసారి.. మెరుగైన స్థాయి

కౌటాల మండలానికి చెందిన కార్తీక్.. మొదటిసారి రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. హ్యాండ్‌బాల్ జట్టులో మూడో సభ్యుడిగా సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో అభ్యసిస్తున్న కార్తీక్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కీలకపాత్ర పోషించాడు. అసోసియేషన్, ఎస్‌జీఎఫ్ ఏర్పాటు చేసిన పలు పోటీల్లో ప్రతిభ చాటాడు. రాష్ట్రస్థాయి ధ్రువీకరణపత్రాలు సొంతం చేసుకున్నాడు. జాతీయస్థాయికి చేరి అదే ఆటతీరుతో మరింత ఉన్నతస్థానానికి చేరుకునేందుకు సిద్ధంగా ఉన్నాడు.



యోగా.. చేస్తాడు బాగా

మంచిర్యాల జిల్లా బొక్కలగుట్టకు చెందిన రాహుల్.. యోగాసనాల్లో దిట్ట. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. యోగాపై మక్కువతో ఆరేళ్లుగా సాధన చేస్తున్నాడు. ఒళ్లును విల్లులా చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. జిల్లా పోటీల్లో సాధించిన పతకాలకు లెక్కే లేకపోగా రాష్ట్రస్థాయిలోనూ అదేతీరును కనబరుస్తున్నాడు. రెండుసార్లు పసిడి పతకాలు కైవసం చేసుకున్నాడు. జాతీయ పోటీల్లోనూ కాంస్య పతకాన్ని తన ఖాతాలో వేసుకోగా ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆసనాలతో ఆకట్టుకుని నాలుగోసారి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు సన్నద్ధమవుతున్నాడు.



ఆసనాలతో ఔరా అనిపించేలా..



హైదరాబాద్‌లో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న మంచిర్యాల జిల్లాకు చెందిన వైష్ణవి యోగాలో ప్రతిభచాటుతోంది. గత నాలుగేళ్లుగా శిక్షణ తీసుకుంటుండగా మొదటిసారి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకుని కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గతంలో ఒకసారి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. జాతీయస్థాయికి తొలిసారి చేరగా ఆసనాలతో ఆకట్టుకుని పతకం సాధించేందుకు సిద్ధమవుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని వార్డు నం.8లోని ఓ గల్లీలో ముళ్లపొదలు రోడ్డును ఆవరించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది
- అరుణ్‌కుమార్, స్థానికుడు

✔ రెండ్రోజుల్లోగా ముళ్లపొదలు తొలగించేలా చర్యలు చేపడతాం.
- అంజయ్య, పురపాలిక కమిషనర్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:

? బాలాజీనగర్ సమీపంలోని వేంకటేశ్వర ఆలయం వెనుక వైపు వీధిలో పిచ్చిమొక్కలు రోడ్డును ఆవహించాయి. పాములు తిరుగుతున్నాయి. పొదలు తొలగించాలి. **- యాదగిరి, కాగజ్‌నగర్**

✔ సిబ్బందిని పంపించి పొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటా.
- అంజయ్య, కమిషనర్, కాగజ్‌నగర్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

? జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో మురుగు కాలువలను శుభ్రం చేయించాలి. పూడిక నిండి దుర్వాసన వస్తోంది. పుర అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించేలా చూడాలి.
- మహేష్, సందీప్‌నగర్

✔ వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించేలా చూస్తాం.
- భుజంగ్‌రావు, పుర కమిషనర్

బంతి కోసం ఇల్లెక్కి విద్యుదాఘాతానికి గురైన చిన్నారులు

★ ఒకరి పరిస్థితి విషమం

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బస్టాండ్ వెనక ఉన్న కాలనీలో గురువారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన పిల్లలు బంతితో ఆటలాడుతున్నారు. ఈక్రమంలో బంతి రేకుల ఇంటిపై పడడంతో దాన్ని తీసేందుకు ఇంటిపైకి ఎక్కారు. దానిపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్తు తీగలు తగిలి సమీర్(11), రిహాన్(10)లు విద్యుదాఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల తర్వాత సమీర పరిస్థితి విషమంగా ఉండటంతో ఇరువురిని మెరుగైన చికిత్సల కోసం మహారాష్ట్రలోని చంద్రాపూర్ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చిన్నారులు స్థానిక ప్రైవేటు పాఠశాలలో నాలుగు, మూడో తరగతి చదువుతున్నారు. అన్నదమ్ములైన ఎస్కే అజిమొద్దిన్, జావొద్దిన్‌ల ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. ఇరువురి పిల్లలు ఒకచోట చేరి ఆటలు ఆడుతుండగా ప్రమాదం జరిగింది. ఇంటిపై నుంచి వెళ్తున్న విద్యుత్తు తీగలకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదానికి కారణమైంది.

మహిళపై దాడి

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని సుంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధి దానపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వ్యక్తి కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఎస్సై మాధవ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆత్రం రాజుకు మూడు నెలల నుంచి మానసిక పరిస్థితి బాగోలేదు. ఇష్టానుసారంగా గ్రామంలో, చేన్ల వెంబడి తిరుగుతుండేవాడు. టేకం మారుబాయి భర్త మారు, ఇద్దరు కుమారులతో కలిసి దానపూర్ శివారులోని తమ పంట చేనులో గుడిసె వేసుకొని జీవిస్తున్నారు. గురువారం ఎవరూ లేని సమయంలో రాజు కొడవలితో వచ్చి మారుబాయి గొంతుకోసేందుకు ప్రయత్నించాడు. జరిగిన పెనుగులాటలో ఆమె తలపై పలుమార్లు గాయపర్చి పరారయ్యాడు. కొద్దిసేపటికి తర్వాత భర్త రక్తపు మడుగులో ఉన్న భార్యను చూసి కుమారులకు విషయం చెప్పారు. ఆమెను తిర్యాణి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల, కరీంనగర్ ఆసుపత్రులకు తరలించినట్లు ఎస్సై వివరించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. భర్త మారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. నిందితుడు పరారీలో ఉన్నారన్నారు.

పోడు రైతులకు న్యాయం చేయాలని వినతి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: సిర్పూర్(టి) మండలం ఇటుకల పహాడ్ గ్రామానికి చెందిన పోడు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ.. గురువారం సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లకు కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. మూడు తరాలుగా బీసీలు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని, సీఎం, మంత్రులను రైతులతో కలిసి నాలుగు ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని కోరామని చెప్పారు.

బురదతో దిగబడుతోంది..

సిర్పూర్(యు) మండలం భూర్నూర్ గ్రామంలోని రైతన్నలు తమ ఎడ్లను పొలాలకు తీసుకెళ్తూ బురదలో అవస్థలు పడుతున్న చిత్రమిది. పంట కోతల సమయం సమీపిస్తుండటంతో తమ పంటలను బురద దారిలో తీసుకొచ్చేదెలా అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు కిలోమీటరుకు పైగా బురదతో నిండి దిగబడుతోందని, ఎడ్లు కూడా సక్రమంగా నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దారిని బాగు చేయాలని కోరుతున్నారు.



దారుణంగా.. పొలాల దారులు!

బురదతో ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

జైనూర్, లింగాపూర్, న్యూస్‌టుడే;

విత్తుకోవడం నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు నిత్యం చేన్లలోనే సమయం గడుపుతుంటారు. వర్షాభావ పరిస్థితులు లేదా అధిక వర్షాలు, చీడపీడలు.. వంటి సమస్యలతో సతమతమయ్యే అన్నదాతలు పంట పొలాలకు వెళ్లేందుకు దారి కష్టాలు పడుతున్నారు. ఇటీవలి వర్షాలకు జిల్లాలోని చాలా గ్రామాల పంట పొలాలకు వెళ్లే మట్టిదారులు అధ్వానంగా మారాయి. బురదమయమై మోకాలిలోతు దిగబడుతున్నాయి. ఎడ్లు సైతం నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. ఏటా వానకాలంలో ఇదే పరిస్థితి ఉంటోందని రైతులు వాపోతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పొలాలకు వెళ్లే దారులకు రోడ్లు మంజూరైనా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. కనీసం మరమ్మతులకు సైతం నోచుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



లింగాపూర్‌లో రోడ్డు కోతకు గురై రాళ్లు తేలి..

హామీ పథకం నిధులతో ఈ దారులకు మరమ్మతులు చేసే అవకాశమున్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



అధ్వానంగా జామ్నిలో పంట పొలాలకు వెళ్లే దారి

వర్షాకాలంలో అంతే సంగతులు....

వర్షం కురిస్తే రైతన్నల ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి. ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో మోకాలిలోతు బురద కారణంగా రాకపోకలు సాగించాలంటే నరకం చూస్తున్నారు. అంతేకాకుండా భారీ వర్షాలకు రహదారులు కోతకు గురై, పెద్ద, పెద్ద రాళ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గాల్లో పంట ఉత్పత్తులు తరలించేందుకు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని దుస్థితి. ఉపాధి

గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలి

- సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో, జైనూర్

పంట పొలాలకు వెళ్లే రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలి. దీని తర్వాత పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేపడతాం.

పీఎం జన్‌మన్ పనులపై సమీక్ష

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో చేపట్టిన పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమ, వైద్య ఆరోగ్య, మిషన్ భగీరథ, వ్యవసాయ, మహిళ శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖలు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీవీటీజీ గ్రామాల్లో మల్టీపర్పస్ కమ్యూనిటీ భవనాల నిర్మాణంలో టెండర్ దశలో ఉన్న వాటి వివరాలతో నివేదిక అందించాలన్నారు. వారి కోసం 3,600 ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రధాన మంత్రి కిసాన్ పథకం కింద ఆధార్ నమోదు ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న 724 మంది రైతుల లింకేజీ పూర్తి చేయాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య శ్రీ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. 13 వేల మంది వివరాలు నమోదు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆధార్‌కార్డుల జారీపై దృష్టి సారించాలని, ఆర్‌ఓఎఫ్ఆర్ కేసులు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. జిల్లా గిసంశ డీడీ రమాదేవి, డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్‌డీవో దత్తారావు, అదనపు ఏపీడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు సబ్ జూనియర్ బాలుర జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనే శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్‌లు తెలిపారు. గత నెల 15-17 వరకు హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి మొదటి స్థానంలో నిలిచినట్లు వివరించారు. కె.రఘు(చెన్నూర్ మండలం), డి.యోగి, కార్తీక్ (కౌటాల మండలం), బి.సాయివర్ధన్ (ఆసిఫాబాద్ మండలం)లు ఉత్తమ ప్రతిభతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 3-7 వరకు హైదరాబాద్‌లోని దిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ఆడనున్నట్లు పేర్కొన్నారు.



ఎంపికైన విద్యార్థులు

పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలి

కెరమెరి, న్యూస్‌టుడే : ప్రభుత్వం చేపడుతున్న కుటుంబ డిజిటల్ కార్డు సర్వే వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా అదనపు పాలనాధికారి దీపక్ తివారీ అన్నారు. గురువారం మండలంలోని ధనోరలో చేస్తున్న సర్వే తీరును పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలో ధనోర గ్రామ పంచాయతీకి ఎంపిక చేసిన విషయంలో తెలిసిందే. కుటుంబ సభ్యుల వివరాలను ఇంటింటికీ తిరిగి, వలస వెళ్లిన లేదా వివాహమై కొత్తగా వచ్చిన వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. తప్పులకు తావుండద్దన్నారు. ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎల్‌పీవో ఓమర్ హుస్సేన్, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అజ్మత్‌పాషా ఉన్నారు.



ధనోరలో పరిశీలిస్తున్న అదనపు పాలనాధికారి దీపక్ తివారీ

కార్మిక వాడల్లో బతుకమ్మ సంబరాలు

రెబ్బెన, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలు కనులపండువగా కొనసాగాయి. గోలేటిలోని కార్మిక వాడలు, భగత్‌సింగ్‌నగర్, దుబ్బగూడెం, రెబ్బెన, నంబాల, నవేగాంలలో మహిళలు రెండో రోజు అటుకుల బతుకమ్మను జరుపుకొన్నారు. బెల్లంపల్లి ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణితో పాటు మహిళలు, పిల్లలు ఆడిపాడారు. వీధులు కోలాహలంగా మారాయి.



గోలేటిలో బతుకమ్మ ఆడుతున్న బెల్లంపల్లి ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, తదితరులు



ఇందిరానగర్‌లో మంగళహారతులతో పూజలు చేస్తున్న భక్తులు



ఆసిఫాబాద్ గాంధీ చౌక్‌లో..



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి దేవర వినోద్, భవాని భక్తులు

దుర్గమ్మ కొలువుదీరె!

ఆసిఫాబాద్ అర్బన్, బెజ్జూరు, రెబ్బెన, దహెగాం, కాగజ్‌నగర్, బల్లార్ష, న్యూస్‌టుడే : జిల్లాలోని ఆయా మండలాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వాడవాడలా దుర్గా, శారదా మాత విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ఏర్పాటు చేసి ప్రతిష్ఠాపన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

★ రెబ్బెన మండలం ఇంద్రానగర్‌లోని శ్రీకనక దుర్గాదేవి ఆలయంలో మొదటి రోజు బాలాత్రిపుర సుందరి రూపంలో అమ్మవారు దర్శనమిచ్చింది. పలువురు భక్తులు అమ్మ భవాని దీక్ష (మాల)ను పూజారి దేవార వినోద్ చేతుల మీదుగా ధరించారు. బెల్లంపల్లి ఏరియా ఖైరిగూర ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్.తిరుపతి, ప్రాజెక్టు అధికారి నరేందర్, ఇన్‌ఛార్జి మేనేజర్ రాజేశ్వర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు.

★ చంద్రపూర్ పట్టణంలో కొలువుతీరిన మాతా మహాకాళి ఆలయంలో నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు దేవి దర్శనం కోసం భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.



రేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో..



వాసవీమాత ఆలయంలో బాలాత్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు



దహెగాం : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మహాకాళి అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారి



తిర్యాణిలో..

వేతనాల కోసం నిరసనలు.. వినతులు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. గురువారం ఏఎన్ఎంలతో కలిసి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, గిసంశ డీడీ రమాదేవిలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. ఎనిమిది నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు వాపోయారు. 24 గంటల పాటు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వారి ఆరోగ్యరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నామని, నెలనెలా జీతాలు ఇవ్వక, కోతలు విధిస్తున్నట్లు ఆవేదన చెందారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, ఏఎన్ఎంలు మహేశ్వరి, కృష్ణవేణి, సునిత, రమాదేవి, హీరాబాయి, సుజాత, శ్రీదేవి, ప్రమీల పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా గిసంశ డీడీ రమాదేవికి వినతి పత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

బీసీ వసతిగృహ కార్మికుల..

ఆసిఫాబాద్: జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో పొరుగు సేవలు, ఒప్పంద విధానంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టి జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సజీవన్‌కు వినతిపత్రం అందించారు. కార్మికులకు 12 నెలలుగా వేతనాలు రావడంలేదన్నారు. కుటుంబ అవసరాలు తీర్చుకోవడం, ఆరోగ్య సమస్యలు ఎదురైనపుడు అప్పులు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, బీసీ హాస్టల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొమురయ్య, అన్సార్, లక్ష్మి, శారద, పార్వతి, శకుంతల, లలిత, పోషక్క, సరోజ తదితరులు పాల్గొన్నారు.



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

వానలు కురవాలని కప్పతల్లి ఆటలు

పెంచికల్‌పేట్, దహెగాం, న్యూస్‌టుడే : పెంచికల్‌పేట్, దహెగాం మండలాల్లో కొన్ని రోజులుగా వర్షాలు కురవక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానలు కురవాలని కోరుతూ గురువారం ఆయా గ్రామస్థులు కప్పతల్లి ఆటలు ఆడారు. గ్రామ దేవతలైన పోచమ్మ, బొడ్రాయి, భీమన్న, మల్లన్నలకు జలాభిషేకం చేశారు.



పెంచికల్‌పేట్‌లో.. కప్పతల్లి ఆడుతున్న భక్తులు



చౌక గ్రామంలో..

త్వరలో తూము షట్టర్‌కు మరమ్మతులు

తిర్యాణి, న్యూస్‌టుడే: మండలంలోని చెలిమల వాగు ప్రాజెక్టు (ఎన్టీఆర్ సాగర్) తూము షట్టర్‌కు త్వరలో మరమ్మతులు చేయిస్తామని ఇరిగేషన్ డీఈ దామోదర్ తెలిపారు. గురువారం ప్రాజెక్టు ప్రధాన తూము షట్టర్, కాలువలను రైతులతో కలిసి పరిశీలించారు. ఇటీవల ప్రధాన తూము షట్టర్ లింకు తెగిపోయి నీటిలో పడిపోవడంతో కాలువలకు నీరు రావడంలేదని అన్నదాతలు తెలపడంతో పరిశీలించారు. గజ ఈతగాళ్ల సహాయంతో నూతన షట్టర్ బిగించి కాల్వలకు నీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. వారి వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చంద్రశేఖర్, అంకం గౌరయ్య, గాడిపెల్లి అంజయ్య తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాల తెరిపించాలని ధర్నా

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో రద్దు చేసిన తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలను తిరిగి తెరిపించాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆదివాసీ సంఘాలతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టిన అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందించారు. బాలికల ఆశ్రమ పాఠశాల స్థానంలో ఆదర్శ క్రీడాపాఠశాలగా మార్చి కొనసాగిస్తున్నారన్నారు. సాధారణ చదువుల కోసం గిరిజన బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. క్రీడా పాఠశాలకు పూర్తిస్థాయి స్టాఫ్‌ను కేటాయించాలని, 3-5 తరగతి పిల్లలను ఆశ్రమాల్లో కాకుండా ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. బాలుర ఆశ్రమ పాఠశాలను మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌గా మార్చాలని కోరారు. ఆదివాసీ సంఘాల సభ్యులు వెడ్మ భగవంత్‌రావు, సుభాష్, భాస్కర్, కొట్నాక రాంషావ్, ప్రకాష్, మారుతి, పవన్‌కుమార్, మురళి, రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్

కోడిపందేల స్థావరంపై దాడులు

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని మొగవెల్లి అటవీ సమీపంలో కోడిపందేలు కొనసాగుతున్న స్థావరంపై కౌటాల సీఐ ముత్యం రమేష్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టి 30 పైగా ద్విచక్రవాహనాలు, నాలుగు కోళ్లు, 29 కత్తులు, రూ.3,280 నగదును స్వాధీనం చేసుకున్నారు. 15మంది వ్యక్తులను అదుపులో తీసుకున్నారు. కొందరు పరారయ్యారు. పట్టుకున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో ఎస్సైలు విక్రమ్, నరేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్పీఎం కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులకు 20 శాతం దసరా బోనస్ చెల్లించాలని భారాస ట్రేడ్ యూనియన్ కన్వీనర్ అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. మిల్లు పునఃప్రారంభమై ఆరేళ్లయినప్పటికీ లాభనష్టాలతో సంబంధం లేకుండా 8.33 శాతం బోనస్ మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ఆశించిన మేర ఉత్పత్తి రావడంలేదన్న కారణంతో మూడు నెలలుగా ఉత్పత్తి బోనస్ సైతం నిలిపివేశారని, ప్రస్తుతం మిల్లు లాభాల్లో ఉందని, వార్షిక ఆదాయం నుంచి 20 శాతం బోనస్ చెల్లించాలని కోరారు. ఆశించిన ఉత్పత్తి రాకపోవడానికి కార్మికులను కారణం చేయొద్దని, రా మెటీరియల్, యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాల్సిన బాధ్యత యాజమాన్యందేనని పేర్కొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు

నిత్య సాధనతో మెలకువలు పెంచుకోండి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో నియర్‌బై మందమర్రి, బెల్లంపల్లి డివిజన్ల మధ్య కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఏరియా ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నిత్యం మెలకువలు, నైపుణ్యాన్ని పెంచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఏరియా క్రీడాకారులు మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి కోలిండియా స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏరియా డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ కిరణ్‌బాబు, జనరల్ కెప్టెన్ జీపీ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారుడికి అభినందన

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి ఉత్తమ క్రీడాకారుడిగా అవార్డు అందుకున్న గోలేటి సింగరేణి పాఠశాలకు చెందిన దామెర ప్రేమ్‌దీప్‌ను జీఎం ఎం.శ్రీనివాస్ అభినందించారు. గురువారం గోలేటి జీఎం కార్యాలయంలో విద్యార్థినిని జ్ఞాపికతో అభినందించారు. గోలేటి సింగరేణి పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. విద్యార్థులు, యువకులు, ప్రజల కోసం సింగరేణి ఆధ్వర్యంలో అన్ని క్రీడా సౌకర్యాలు అందుబాటులో ఉంచామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు

ఏరియా అధికారికి అవార్డు రావడం అభినందనీయం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఇటీవల జరిగిన 66వ జాతీయ కన్వెన్షన్ సెమినార్‌లో బెల్లంపల్లి ఏరియా డీజీఎం (ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహరాకు అవార్డు రావడం గర్వకారణమని జీఎం శ్రీనివాస్ అన్నారు. గురువారం గోలేటి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. జాతీయ స్థాయిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ వారు అందించే కోలిండియా ఉత్పాదకత అవార్డు ఏరియా అధికారి సాధించడం అభినందనీయమన్నారు. ఎస్ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 49 శాతం బొగ్గు ఉత్పత్తి

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియాకు సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను వర్షం ప్రభావంతో రెండు నెలల నుంచి అధిగమించలేకపోయినట్లు జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు. గురువారం గోలేటి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్సు హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సెప్టెంబరులో ఏరియా సాధించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను వెల్లడించారు. 2.40 లక్షల టన్నులకు గాను 1.18 లక్షల టన్నుల (49 శాతం) బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించినట్లు చెప్పారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఆరు నెలల్లో 86 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరులలో అధిక వర్షం పడిందన్నారు. గోలేటి ఓసీపీ కోసం 615 హెక్టార్ల ఫారెస్టు భూమి అనుమతుల కోసం అన్ని చర్యలు తీసుకుంటున్న పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలు గోలేటి సింగరేణి పాఠశాల మైదానం, దసరా వేడుకలను శ్రీభీమన్న మైదానంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.. ఇప్పటి వరకు బెల్లంపల్లి ఏరియాలో 1405 మందికి ఆరోగ్యకార్డులు, 318 మందికి వారసత్వ ఉద్యోగాలు కల్పించినట్లు వివరించారు. పీడీఎఫ్ ద్వారా 154 మందికి గాను 133 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలో మిగతా 21 మందికి ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వలకుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.





వివరాలు వెల్లడిస్తున్న జీఎం ఎం.శ్రీనివాస్